క్లుప్తంగా

చెట్లను తొలగించిన అధికారులు



ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న తీగచెట్లను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కంభం: విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు చిల్లచెట్లు, తీగలతో నిండి పోయి ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో సాక్షి దినపత్రికలో 'అల్లుకున్న నిర్లక్ష్యం' అన్న శీర్షికతో ప్రచురితమైన కథనాని విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం స్పందించారు. స్థానిక ఎస్‌బీఐ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, పాత ప్రభుత్వ వైద్యశాల వెనుక ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న చిల్లచెట్లను తొలగించారు. ఒరిగి పోయిన విద్యుత్ స్తంభాలను సరిచేస్తామని అధికారులు తెలిపారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న యాదవ ఉద్యోగ సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లుయాదవ్ గౌరవ డాక్టరేట్ పొందిన సందర్భంగా యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని జ్యోతిరావు పూలే పార్కు ఆవరణలో ఆదివారం సన్మానం చేశారు. మొర్రిపిచ్చయ్య యాదవ్ మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో మంచి గుర్తింపు సాధించిన బోనేని వెంకటేశ్వర్లుయాదవ్‌కు సామాజిక సేవా రంగంలో డాక్టరేట్ అందించడం చాలా గొప్ప విషయమన్నారు. బీసీ నాయకులు ఒ. వెంకటయ్య యాదవ్, యాదవ ఉద్యోగ సంఘం నాయకులు కటారు పోలయ్య యాదవ్, రమణయ్య, ఈశ్వరయ్య, బాలయ్య, కృష్ణ, హరికృష్ణ, శేఖర్, పుల్లయ్య, సూర్యనారాయణ, పాండు, గోపాల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బేస్తవారిపేట: అర్ధవీడు మండలంలోని నాగులవరం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 2004–2005 పదో తరగతి పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరారు. తమకు చదువు నేర్పిన గురువులకు సన్మాన కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు.

విశ్వకర్మ నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం

గిద్దలూరు రూరల్: స్థానిక రాచర్ల రోడ్డులో కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన 18 రకాల చేతి వృత్తుల వారికి శిక్షణ కేంద్రాన్ని బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ శిక్షణ కేంద్రంలో చేతి వృత్తుల వారితో వారి నైపుణ్య సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల చేతి వృత్తుల కళానైపుణ్యం కలిగిన వారికి జీవనోపాధిగా ఈ శిక్షణ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. భవనాశి రామాంజనేయులు, ఖాదర్, మట్టిమల్ల పుల్లయ్య, షఫీ, బండారి జయప్రసాదు, వీరచక్రం, కె.కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మానవతా సభ్యులు

దర్శి: నిరుపేద కూలీ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. వివరాల్లోకి వెళితే..పట్టణంలోని ఎస్సీ కాలనీలో పెయింటర్‌గా పనికి కూలికి వెళ్లే గర్నెపూడి శివప్రసాద్ ఇటీవల ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మానవత సంస్థ ప్రతినిధులు శివప్రసాద్ కుటుంబానికి ఆత్మీయ సహకారం అందించారు. సంస్థ చైర్మన్ దేవత వరప్రసాద్ చేతుల మీదుగా రూ.5000, స్వాతి కలర్స్ యజమాని ఎదురు నారాయణరెడ్డి చేతుల మీదుగా రూ.5000 ఆర్థిక సాయంగా అందజేశారు. పేద కుటుంబాన్ని ఆదుకున్నందుకు స్థానికులు వారిని అభినందించారు. మానవత సభ్యులు వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాకా జనార్దన్‌రెడ్డి, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, ట్రెజరర్ జి.వేణు, డైరెక్టర్ పి.రాజశేఖరెడ్డి, సభ్యులు అంబటి వెంకటేశ్వరరెడ్డి, వాకా పూర్ణ చంద్రారెడ్డి, గర్నెపూడి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పల్లెకు పచ్చ ఓణీ



లేత దశలో ఉన్న పొగాకు పంట



పచ్చదనం నెలకొన్న కంది



చినారికట్లలో సాగు చేసిన బంతి పూల తోటలు



కళకళలాడుతున్న పత్తి పంట

కొనకనమిట్ల: పల్లెలంటే పచ్చదనంతో నిండి ఉంటాయి. సకాలంలో వర్షాలు పడితే మొక్కలు.. పంటలు.. చెట్లు.. చేమలతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. మొన్నటి దాకా వర్షాభావ పరిస్థితులు రైతులకు కంట కన్నీరు తెప్పించినా.. ఇటీవల కురిసిన వర్షాలతో మెట్ట పంటలకు జీవం అందింది. ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, పత్తి, ఆముదం పంటలతో పాటు మినుము, అలసంద(బొబ్బర్లు), వేరుశనగ, వరి, మిర్చి, పొగాకు, కూరగాయలు, పండ్ల తోటలతో కళకళలాడుతున్నాయి. చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలకు నీరు చేరటంతో అంతా ఊపిరి పీల్చుకుంటున్నారు. వరి, మిర్చి నాట్లు పూర్తవగా లేత సాగులో పొగాకు నాట్లు వేస్తున్నారు. అలాగే బంతి, కారం బంతి, చామంతి, కనకాంబరాల పూల సాగు లాభ సాటిగా మారింది. పలు గ్రామాల్లో సాగు చేసిన బంతి పూల తోటలు అందాలు విరజిమ్ముతున్నాయి. కొనకనమిట్ల, దొనకొండ, సంతనూతలపాడు, చీమకుర్తి, హనుమంతునిపాడు, దర్శి మండలాల రైతులు సాగు చేపట్టారు. సంప్రదాయ పంటలు ప్రతి ఏడాది అనుకున్న మేర లాభాలు ఇవ్వకపోవటంతో రైతులు ఉద్యానవన పంటలవైపు దృష్టి సారిస్తున్నారు.

పండగలు ప్రశాంతంగా జరుపుకోండి

- రికార్డింగ్ డ్యాన్స్‌లు, అశ్లీల నృత్యాలు చేస్తే కఠిన చర్యలు
- సెలవుల్లో పిల్లలపై నిఘా పెట్టాలి



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు, పక్కన సీఐ సుబ్బారావు

మార్కాపురం: దసరా, దీపావళి పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ నాగరాజు సూచించారు. ఆదివారం తన కార్యాలయంలో సీఐ సుబ్బారావుతో కలిసి మాట్లాడారు. పండగ సెలవులు కావడంతో పిల్లలంతా ఇళ్లకు వస్తుంటారని, చెరువులు, వాగులు, గుండ్లకమ్మలకు ఈతకు వెళ్లకుండా నిఘాపెట్టాలన్నారు. యువతకు టూవీలర్స్ ఇచ్చేటప్పుడు లైసెన్స్ ఉందో లేదో చూడాలని, లైసెన్సులు లేకపోతే వాహనాలను ఇవ్వకూడదని హెచ్చరించారు. సెలవుల సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. పండగల వేళ రికార్డింగ్ డ్యాన్స్‌లు, అశ్లీల నృత్యాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, మట్కా, కోడిపందేలు ఆడితే కూడా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. మారుమూల గ్రామాల్లో కూడా తాము నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నామని, పోలీసులతో దోబూచులాడవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వలన చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్‌ఫోన్ ఇచ్చేప్పుడు జాగ్రత్తలు చెప్పాలన్నారు. సెల్‌ఫోన్‌లో పొరబాటున ఎవరైనా సైబర్ క్రైమ్‌కు సంబంధించిన ఇబ్బందిపడ్డా.. ఫోన్‌లలో ఎవరైనా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినా.. వీడియోలు డౌన్‌లోడ్ చేసి బ్లాక్ మెయిల్‌కు గురవుతున్నా తమకు సమాచారం అందించాలని వారికి పోలీసు సాయం అందిస్తామని తెలిపారు.

లైసెన్సులు తప్పనిసరి

దీపావళి పండగ సందర్భంగా టపాసులు అమ్మే దుకాణదారులు కచ్చితంగా పోలీసుశాఖ నుంచి లైసెన్సు తీసుకోవాలని సీఐ సుబ్బారావు తెలిపారు. అనధికారికంగా తయారు చేసినా.. లైసెన్సులు లేకుండా అమ్మినా.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి టపాసుల అమ్మకాలకు సంబంధించి సింగిల్‌విండో విధానం ద్వారా లైసెన్సులు ఇస్తామని చెప్పారు. దీపావళి మందులు అమ్మే ప్రాంతాల్లో నిర్వాహకులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.



మార్కాపురం: లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో..



మార్కాపురం: దర్శనమిస్తున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారు



పొదిలిలో అమ్మవారు



బేస్తవారిపేటలో నటరాజేశ్వరీ దేవిగా వాసవీమాత



బేస్తవారిపేటలో గజలక్ష్మీదేవిగా కోటసత్యమాంబదేవి

వైభవోపేతంగా దసరా ఉత్సవాలు



సోమవారిపేటలో బాలత్రిపుర సుందరీదేవిగా చౌడేశ్వరీదేవి



గిద్దలూరు: అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు



గొట్లగట్టు రామాలయంలో..



కొనకనమిట్ల రామాదూత క్షేత్రంలో



రేగడపల్లిలో..

కొనకనమిట్ల: దసరా మహోత్సవాలు గత నాలుగు రోజులుగా వైభవోపేతంగా జరుగుతున్నాయి. మండలంలోని గొట్లగట్టు రామాలయం, కొనకమిట్ల రామదూతక్షేత్రం, పెదారికట్ల శివాలయం, మహాలక్ష్మమ్మగుడి, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవికి కుంకమార్చనలు వేడుకగా జరిపించారు. అయా గ్రామాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో పలువురు ఉభయదాతలు పాల్గొని అమ్మవారికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పసుపు, కుంకుమ, పండ్లు, పూలు, గాజులు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.

కంభం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

బేస్తవారిపేట: దసరా శరన్నావరాత్రి ఉత్సవాలు సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా, కోటసత్యమాంబదేవి ఆలయంలో గజలక్ష్మీదేవిగా, సోమవారిపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో బాలత్రిపురసుందరీదేవిగా అలంకరణలు చేశారు. పాపాయిపల్లె, బేస్తవారిపేట పోలేరమ్మ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అద్దాల మండపంలోని ఊయలలో ఉన్న అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరించారు. కాశీనాయన కుంట ఆవరణలోని గాయత్రీమాత ఆలయంలో అమ్మవారు మీనాక్షిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గాయత్రి పరివార్ సభ్యుల ఆధ్వర్యంలో కుంకుమార్చనపూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వీరన్నబావి సమీపంలో గల కాళికాంబ ఆలయంలోని అమ్మవారిని లలితా త్రిపురసుందరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరవ రోడ్డులో గల కాశీ నాయన కుంట కట్ట మీద గల కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొమరోలు: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని కొమరోలు పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నాలుగు రోజులుగా దసరా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వాహకులు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు భక్తులకు గజలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

పొదిలి: స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శాశ్వత ఉభయదాతలు గునుపూడి మధూసూనరావు, పద్మావతి, పుష్పాలంకరణ ఉభయదాత కనమర్లపూడి సుబ్బారావు, వరలక్ష్మి దంపతులను మంగళ వాయిద్యాలతో ఆలయంలోకి ఆహ్వానించారు. వారిచే ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జీసీ సుబ్బారావు, కార్యదర్శి వేమా కృష్ణమూర్తి, కోశాధికారి కంకణాల రమేష్, యక్కలి శేషగిరిరావు, పమిడిమర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: శ్రీ అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోర్కెలు తీర్చి అందరినీ చల్లగా చూడాలని మార్కాపురం పట్టణ శివారులో ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి శరన్నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలను ఆదివారం నిర్వహించారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి గాంచింది. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది తదితరులు పర్యవేక్షించారు.

మార్కాపురం టౌన్: పట్టణంలోని వివిధ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మార్కండేశ్వరస్వామి ఆలయంలో జగన్మాత సరస్వతీదేవీగా భక్తులకు దర్శనమివ్వడంతో విశేషసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు ధాన్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. మెయిన్‌బజారులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీమాత అన్నపూర్ణాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు.

తర్లుపాడు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా స్థానిక శ్రీ రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి వారి దేవాలయంలో అమ్మవారు ఆదివారం శ్రీ లలితా త్రిపుర సుందరి దేవీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా ముద్దసానమ్మ కుంకుమ పూజ

మార్కాపురం రూరల్: మండలంలో జమ్మనపల్లి వద్ద వెలసివున్న శ్రీ ముద్దసానమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి వైభవంగా కుంకుమపూజ అర్చకులు నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు పాల్గొని కుంకుమ పూజలు చేశారు. ఉదయం గణపతిపూజ, అఖండ దీపస్థాపన, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, అంకురార్పన, నవగ్రహ మండపారాధన తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. దసర సరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించు కునేందుకు పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పవన్‌స్వామి, దేవస్థాన కమిటీ సభ్యులు గొలమారి వీరారెడ్డి, మాలపాటి అంకాళరెడ్డి, టంగుటూరి భాస్కర్‌రావు, గార్లపాటి రామకృష్ణారావు, మేడా శ్రీనివాసరావు, పెసల వెంకట జనార్దన్, సూరె శ్రీకాంత్ తదితరులు భక్తులకు సౌకర్యాలను పర్యవేక్షించారు.



తర్లుపాడు: లలితా త్రిపురసుందరీ దేవీ అలంకారంలో అమ్మవారు



ప్రత్యేక అలంకారంలో ముద్ద సానమ్మ అమ్మవారు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



కంభంలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు



గిద్దలూరు: గాయత్రి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న గాయత్రి పరివార్ సభ్యులు

ముమ్మరంగా సజ్జ నూర్పిళ్లు




నాగంపల్లిలో సజ్జ పంట నూర్పిళ్లు

కొనకనమిట్ల: మండలంలో ఖరీఫ్‌లో చేపట్టిన సజ్జపంట కోతలు కోసిన రైతులు ముమ్మరంగా సజ్జపంట నూర్పిడులు చేస్తున్నారు. మండలంలో సుమారు 500 ఎకరాల్లో సజ్జ పంట సాగు చేశారు. మండలంలోని నాగంపల్లి, మునగపాడు, వెలిగండ్ల, నాగరాజుకుంట, చింతగుంట, అంబాపురం, రేగడపల్లి, వాగుమడుగు, సిద్దవరం గ్రామాల్లో ఎక్కువగా సజ్జ సాగు చేశారు. అయితే ఈ ఏడాది అరకొరగా వర్షాలు పడటంతో పంట దిగుబడి పెద్దగా లేదని రైతులు తెలిపారు. సజ్జ పంట ఎకరాకు 8 నుంచి 10 బస్తాలు మేర దిగుబడి వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం సజ్జలు క్వింటా ధర రూ. 2200 వరకు బయట మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ఎక్కువగా కొనుగోలు చేస్తు రైతులకు కొంతమేర పెట్టుబడులు పోను లాభాలు వచ్చే అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సజ్జ కోతలు అయిన తరువాత పొలాలను దుక్కులు దున్ని రబీ పంటగా అలసంద లేదా శనగ పంటను సాగు చేపడతామన్నారు. రెండో పంటలో మంచి దిగుబడి వచ్చి ధరలు బాగుంటే పెట్టుబడులు పోను కొంత ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది.

అంకాళమ్మకు ఘన పూజలు

కొనకనమిట్ల: సకాలంలో వర్షాలు కురిసి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని మండలంలోని గొట్లగట్టు గ్రామంలో ఆదివారం సాయంత్రం అంకాళమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి పూజలు జరిపించారు. అంకాళమ్మా.. దీవించమ్మా అంటూ గ్రామంలో మేళతాళాలతో ఉత్సవం నిర్వహించారు. గ్రామ సమీపంలోని కొండపై పూజలు నిర్వహించి ప్రజలంతా సహపంక్తి భోజనాలు చేశారు. ముందుగా గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం వద్ద వేపచెట్టు వద్ద పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సకాలంలో వర్షాలు కురవాలని పాడి పంటలు సంవృద్ధిగా పండాలని, ప్రజలను చల్లగా కాపాడాలని మొక్కుకున్నారు.

మూడు ఇసుక వాహనాలు సీజ్



సీజ్ చేసిన వాహనాలు

మార్కాపురం: కర్నూలు జిల్లా ఆత్మకూరుకు వెళ్లాల్సిన ఇసుక లారీ మార్కాపురంలో లోడింగ్ అవుతుండగా కనుగొని సీజ్ చేసినట్లు మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ యం. విష్ణువర్ధన్‌రావు ఆదివారం తెలిపారు. లారీ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నెల్లూరు నుంచి చిన్నారికట్ల జంక్షన్ మీదుగా వెళ్తున్న ఇసుక లారీని తనిఖీ చేసి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి 25 వేల రూపాయల పెనాల్టీ వేసినట్లు తెలిపారు. మార్కాపురం పట్టణంలో అనధికారికంగా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా సీజ్ చేసినట్లు చెప్పారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీజ్ చేసిన వాహనాలను ఆర్టీసీ డిపోకు తరలించినట్లు తెలిపారు.

అన్నపై తమ్ముడు దాడి

బేస్తవారిపేట: స్థానిక పోలేరమ్మ ఆలయం సమీపంలో అన్నపై తమ్ముడు దాడి చేసిన సంఘటన జరిగింది. అన్నదమ్ములు మధ్య స్థల వివాదం ఉంది. ఈ నేపథ్యంలో దూదేకుల పెద్ద బాదుల్లా పశువుల పాకలో పనిచేసుకుంటున్న సమయంలో తమ్ముడు చిన్న బాదుల్లా వచ్చి దాడిచేశాడు. మొద్దు కత్తితో వెనుకవైపు నుంచి తలపై కొట్టడంతో తల పగిలి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు